# గీత కార్మికులకు బీఆర్ఎస్ అండ

- తాటి, ఈత చెట్లపై పన్నులు రద్దు ● మద్యం దుకాణాల్లో 15శాతం రిజర్వేషన్లు
- 50 ఏండ్లు నిండిన వారికి ₹2,016పింఛన్ ● ప్రమాదబీమా ₹5లక్షలకు పెంపు
- రైతుబీమా తరహాలో 'గీతబీమా'కు ప్రణాళికలు
- కృతజ్ఞతలు తెలుపుతున్న గౌడ సామాజిక వర్గం




కల్లు సేకరించడానికి బైక్‌పై వెళ్తున్న గీత కార్మికుడు

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 19(నమస్తే తెలంగాణ): వృత్తినే నమ్ముకున్న గీత కార్మికుల కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ వివిధ సంక్షేమ పథకాలు అమలు చేసి, అండగా నిలిచారు. 50ఏండ్లు నిండిన గీత కార్మికుడికి నెలకు ₹2,016 పింఛన్ ఇస్తూ అండగా నిలాచారు. ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి కిందపడి మరణించిన కార్మికుడి కుటుంబానికి ప్రమద బీమాను ₹2లక్షల నుంచి ₹5లక్షలకు పెంచి భరోసా కల్పిస్తున్నారు. అలాగే ఈత, తాటి చెట్లపై ఉన్న పన్నులను రద్దు చేశారు. జిల్లాలోని చెట్లపై పన్నుల రూపంలో నెలకు వచ్చే ₹5.20లక్షలు, ఏడాదికి ₹62.44లక్షల ఆదాయం గీతన్నలకు మిగులుతుండడంతో గీత కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

**ప్రమాదబీమా ₹5లక్షలకు పెంపు**

ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి కిందపడి మరణించిన కార్మికుడి కుటుంబానికి కేసీఆర్ సర్కారు అండగా నిలుస్తున్నది. గతంలో ₹2లక్షలు ఉన్న పరిహారాన్ని ₹5లక్షలకు పెంచింది. పదేండ్లలో 20మంది చనిపోగా, బాధిత కుటుంబాలకు ₹కోటి పరిహారం అందించింది. అలాగే చెట్టు పైనుంచి పడి గాయపడ్డ వారికి సైతం ఆర్థిక సాయం అందజేస్తున్నది. శాశ్వత అంగవైకల్యం చెందిన కార్మికుడికి గత ప్రభుత్వం ₹50వేలు మాత్రమే ఇచ్చేది. తెలంగాణ ప్రభుత్వం ₹5లక్షలకు పెంచింది. గాయపడ్డ 166 మంది గీత కార్మికులకు ₹2కోట్ల 60లక్షల 20వేలు ఇచ్చి భరోసానిచ్చింది.

**'గీత బీమా'కు ప్రణాళికలు**

వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న గీతకార్మికుల కోసం తెలంగాణ ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టింది. అలాగే రైతుల కోసం ఏ విధంగా అయితే రైతుబీమా సౌకర్యం ఉన్నదో.. అదే విధంగా గీతబీమాను అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. గీతబీమా అందుబాటులోకి వస్తే జిల్లాలో సుమారు 15వేల మంది గీతా కార్మికులకు లబ్ధి చేకూరనున్నది.

**మద్యం దుకాణాల్లో రిజర్వేషన్లు**

గీత కార్మికులు వ్యాపారం చేసుకునేలా కేసీఆర్ సర్కారు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నది. గౌడ సామాజికవర్గం ఆర్థికంగా ఎదగాలన్న ఉద్దేశంతో, దేశంలో ఎక్కడా లేనివిధంగా మద్యం దుకాణాల్లో కొత్తగా 15శాతం రిజర్వేషన్లు కల్పించింది. జిల్లాలో 48మద్యం దుకాణాలుండగా, అందులో తొమ్మిది షాపులను గౌడ సామాజిక వర్గానికి కేటాయించింది.

**2,373 మందికి 'ఆసరా'**

ఆసరా పింఛన్ల వయసు గత సర్కారులో 65 ఏండ్లకు ఉండేది. అందులో నెలకు ₹200 పింఛన్ మాత్రమే వచ్చేది. తెలంగాణ ప్రభుత్వం గీత కార్మికుల వయో పరిమితిని 50ఏండ్లకు తగ్గించింది. ప్రతినెలా ₹2,016 పింఛన్ అందిస్తున్నది. జిల్లాలో 2,373 మందికి ₹4కోట్ల 78లక్షలు ప్రతి నెలా పింఛన్ల రూపంలో మంజూ రు చేస్తున్నది. నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ చేయడంతో లబ్ధిదారుల్లో సంతోషం వ్యక్తమవుతున్నది.

## పన్నులు మాఫీ అయినయ్



సమైక్య సర్కారు పన్నుల మీద పన్నులు వేసింది. మమ్మల్ని ఏ నాడు పట్టించుకోలేదు. కల్లు అమ్మిన పైసలు పన్నులకే పెట్టినం. చెట్టెక్కి పడ్డ.. ఏ నాయకు డు మామొకాన సూడలేదు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ సారు ఊరూర పర్యటించినప్పుడు కల్లు మండవాలోకి వచ్చి మా బతుకులు చూసి చలించిపోయిండు. స్వరాష్ట్రం వచ్చినంక ముఖ్యమంత్రిగా అయినంక చెట్లకు వేసిన కిస్తులు రద్దుచేసిండు. నెలకు మా సొసైటీకి దాదాపు ₹10వేలకు పైగా మిగులుతున్నయ్. చెట్టు పైనుంచి పడి చనిపోయిన కుటుంబానికి ₹2లక్షలు ఉన్న ఆర్థిక సాయాన్ని ₹5లక్షలకు పెంచిండు. జిల్లాలో ఇప్పటి వరకు 20మంది చనిపోయిండు. ఆ కుటుంబాలకు ₹5లక్షల చొప్పున ఇచ్చి అండగా నిలిచిన కేసీఆర్‌కు మేము కృతజ్ఞతగా ఉంటం

*- తాళ్లపల్లి బాలరాజుగౌడ్, పెద్దూరు (సిరిసిల్ల)*

## వైన్స్‌ల్లో రిజర్వేషన్ కల్పించిండు



ఒకప్పుడు కల్లుకు బాగా డిమాండ్ ఉండేది. రానురాను ఎర్ర మందుకు అలవాటైతున్నరు. ఎవరు చూసినా ఎర్ర మందే అంటున్నరు. కేసీఆర్ సారు మా గురించి బాగా పట్టించుకుంటుండు. అందుకే వైన్స్‌లకు మా సామాజికి వర్గానికి 15శాతం రిజర్వేషన్ ఇచ్చిండు. జిల్లాలో మాకులపోళ్లకు 9 దుకాణాలు వచ్చినయ్. పైసలున్నోళ్లతో పోటీపడలేని మాకు కేసీఆర్ సార్ జెయ్యవట్టి మద్యం దుకాణం సులువైంది. వ్యాపారులుగా ఎదిగేందుకు సార్ చేసిన సహాయం ఎన్నటికీ మరిచి పోము.

*- బెజ్జారపు స్వామిగౌడ్, గీత కార్మికుడు (సిరిసిల్ల)*

## పింఛన్‌తో భరోసా కలిగింది..



నేను, చిన్నప్పటి నుంచి నడుముకు మోకుకట్టుకుని కల్లుగీత్తున్న. ఇపుడు వయసు మీరుతోంది. ఎర్ర మందు జెయ్యవట్టి కల్లుకు గిరాకీ తగ్గింది. వయసు మీదపడుతుంది. ఎట్ల బతుకుడోనని రందీ పడుతుంటే కేసీఆర్ సార్ జెయ్యవట్టి నెలకు ₹2,016 వత్తున్నయ్. నాకైతే భరోసా కలిగింది. సారు ఉన్నన్ని రోజులు ఢోకా లేదు. సార్‌కు మద్దతుగా నిలుస్తం

*- పిడుగురాళ్ల బాగయ్యగౌడ్ (సిరిసిల్ల)*

## కేటీఆర్ సార్‌తోనే అభివృద్ధి



ఎల్లమ్మదేవీని నమ్ముకుని కులవృత్తిని చేసుకుంటున్నం. ఏ సర్కారు మమ్మల్ని పట్టించుకున్న పాపానపోలేదు. చిన్న చెట్టు, పెద్ద చెట్టుకు కిస్తులు కట్టలేక ఇంకో పని దొరకక కూలీ పనిచేసి బతుకులు ఎల్లదీసినం. తెలంగాణ సర్కారు వచ్చినంక మా గురించి ఆలోచిస్తున్నది. కేటీఆర్ సార్ జెయ్యవట్టి చెట్ల పన్ను రద్దు అయ్యింది. ఎవరైనా చనిపోతే మునుపు ₹2లక్షలు ఇస్తుండే. సార్ వచ్చినంక ₹5లక్షలు ఇస్తున్నరు. కేటీఆర్ సార్‌కు మేము రుణపడి ఉంటం.

*- తాళ్లపల్లి వేణుగౌడ్, పెద్దూరు (సిరిసిల్ల)*

# ఓటరు స్లిప్పులపై క్యూఆర్ కోడ్

- సాంకేతిక హంగులతో ఓటరు స్లిప్పులు
- ఫొటోల స్థానంలో క్యూఆర్ కోడ్ ముద్రణ

సిరిసిల్ల, నవంబర్ 19: ఓటరు స్లిప్పులకు ఎన్నికల సంఘం సాంకేతిక హంగులను పొందుపరిచింది. గత ఎన్నికల్లో మాదిరిగా ఓటరు స్లిప్పులపై ఓటరు ఫొటో ముద్రించకుండా క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఓటరు ఫొటోలను క్యూఆర్ కోడ్‌తో అనుసంధానం చేసి ముద్రించింది. ఓటింగ్‌లో పాల్గొనే ఓటర్లను ఎన్నికల అధికారులు స్లిప్పులతో పాటు ఎన్నికల సంఘం ప్రత్యేకంగా ఓటింగ్‌లో పాల్గొనడానికి సూచనలు చేస్తూ తయారు చేసిన ఓటర్ గైడ్ , సీ విజల్‌పై అవగాహన కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. ఓటరు నమోదుకు అర్హతలు, ఆన్‌లైన్ ప్రక్రియ , ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ సజావుగా నిర్వహించేందుకు ప్రవేశపెట్టిన యాప్ లు, పోస్టల్ బ్యాలెట్ పొందడానికి అర్హతలు, ఓటరు ప్రతిజ్ఞ, ఓటు వేసే విధానం, పోలింగ్ రోజు సెలవు దినం తదితర అంశాలను ఓటరు గైడ్‌లో తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ముద్రించారు. ఓటరు స్లిప్పులో ఓటరు వివరాలు, వెనుక భాగంలో ఓటు వేయడానికి వెళ్లేటపుడు , వేసే సమయంలో పోలింగ్ కేంద్రంలో పాటించాల్సిన నియమాలు, పోలింగ్ బూత్ రూట్ మ్యాపులను పొందుపరిచారు. గ్రామాల్లో బూత్ లెవల్ అఫీసర్లు(బీఎల్‌వో)లు ఇంటింటికీ తిరిగి కొత్త ఓటరు స్లిప్పులను పంపిణీ చేస్తున్నారు.

**సిరిసిల్ల నియోజకవర్గ ఓటర్లు మండలాల వారీగా ..**

| మండలం | పురుషులు | మహిళలు | ట్రాన్స్‌జెండర్లు | మొత్తం |
|---|---|---|---|---|
| వీర్నపల్లి | 5657 | 5713 | 0 | 11370 |
| ఎల్లారెడ్డిపేట | 19566 | 20614 | 0 | 40180 |
| గంభీరావుపేట | 17549 | 18434 | 1 | 35984 |
| సిరిసిల్ల | 39462 | 40975 | 6 | 80443 |
| తంగళ్లపల్లి | 18519 | 19361 | 0 | 37880 |
| ముస్తాబాద్ | 18910 | 19659 | 0 | 38569 |
| మొత్తం | 119663 | 124756 | 7 | 244426 |

## యువతి పెళ్లికి ఎన్ఆర్ఐ అండ

వేములవాడ రూరల్, నవంబర్ 19 : వేములవాడ రూరల్ మండలం ఫాజుల్‌నగర్‌కు చెందిన నిరుపేద యువతి మీనాక్షి వివాహానికి ఎన్ఆర్ఐ గౌడుగు రాజ్‌కుమార్ ఆర్థిక సహాయం అందజేసినట్లు సర్పంచ్ వేణుగోపాల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన మీనాక్షి వివాహానికి ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో అదే గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ గౌడుగు రాజ్‌కుమార్ వివాహానికయ్యే ఖర్చును భరించారన్నారు. రాజ్‌కుమార్‌తో పాటు అజ్జు, పొన్నం మహేశ్, దుర్గం సురేశ్, మహిపాల్ తోడ్పాటును అందించారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ గడ్డం హన్మాండ్లు, జక్కుల తిరుపతి, రేపాక భాను ఉన్నారు.

# చల్మెడకు మున్నూరుకాపుల మద్దతు



చల్మెడ లక్ష్మినరసింహారావుకు మద్దతు తెలుపుతున్న చింతల్‌ఠాణా కాపు సంఘం నాయకులు

వేములవాడ రూరల్, నవంబర్ 19: బీఆర్ఎస్ వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మినరసింహారావుకే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని వేములవాడ అర్బన్ మండలం చింతల్‌ఠాణా ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన మున్నూరు కాపు సంఘం సభ్యులు ప్రకటించారు. ఆదివారం వేములవాడ పట్టణంలో చల్మెడను కలిసి మద్దతు తెలిపారు. అనంతరం చల్మెడ మాట్లాడుతూ మున్నూరుకాపు సంఘం సభ్యులు మద్దతును స్వాగతిస్తున్నానని, గెలిచిన వెంటనే సంఘ సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంఘం గౌరవాధ్యక్షుడు గుర్రం మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు ఎర్రం శ్రీధర్, బొప్పా శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే రమేశ్‌బాబు, బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ



పెళ్లి వేడుకలో ఎమ్మెల్యే రమేశ్‌బాబు, చల్మెడ, నేతలు

వేములవాడ, నవంబర్19: వేములవాడ పట్టణంలో ఆదివారం జరిగిన పలు వివాహ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ ప్రధాన సలహాదారు, ఎమ్మెల్యే రమేశ్ బాబు, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు పాల్గొన్నారు. వేములవాడ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కముటాల వేణు –హరిత కూతురు వేదశ్రీ–సంతోష్‌కుమార్ వివాహంతో పాటు కొలనూర్ ప్యాక్స్ వైస్ చైర్మన్ కాసవేని మహేశ్– సుజాత, సుద్దాల బీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ సుంకే పరశురాములు – జలజ, అగ్రహారం ఆంజనేయ ఆలయ ట్రస్టు సభ్యుడు పెరుమాండ్ల రవిచందర్ గౌడ్ సోదరుడి కుమార్తె రుచిత – శివగౌడ్ వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట మార్క్ ఫెడ్ డైరెక్టర్ బండ నర్సయ్య యాదవ్, ప్యాక్స్ చైర్మన్ రామ్మోహన్‌రావు, కోనరావుపేట మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గోపు పరశురాములు, సీనియర్ నాయకులు కట్కూరి శ్రీనివాస్, తీగల వెంకటేశ్వరరావు, శ్రీ కుమార్, కృపాల్ ఉన్నారు.

## నర్మాలలో వైద్య శిబిరం

గంభీరావుపేట, నవంబర్ 19: నర్మాలలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 120 మందికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సూచనలు చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మండలాధ్యక్షుడు లక్కిరెడ్డి సంతోష్‌రెడ్డి, కోశాధికారి చేపూరి కిషన్, సభ్యులు గొల్లపల్లి నాగరాజు, నర్సింహరాజు, పరశురాములు, దేవరాజు పాల్గొన్నారు.

## కబ్జాకు పాల్పడితే చర్యలు

- ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్‌రావు
- బీట్ ఆఫీసర్ వేణు సస్పెన్షన్

ఎల్లారెడ్డిపేట/వీర్ణపల్లి, నవంబర్ 19: అటవీ భూముల కబ్జాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎఫ్ఆర్‌వో శ్రీనివాసరావు హెచ్చరించారు. ఆదివారం రంగంపేట ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ వేణు రంగంపేటలో కొందరు వ్యక్తులు అటవీ భూమి కబ్జాకు పాల్పడేందుకు యత్నించగా సహకారం అందించడంతో సస్పెండ్ చేశామని తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఏడాది ఫిబ్రవరిలో రంగంపేటకు చెందిన కోలారెడ్డి మరి కొందరు గ్రామ శివారులోని వేపలగడ్డ ప్రాంతం వద్ద అటవీభూమిని కబ్జా చేసేందుకు యత్నించారు. వీరికి బీట్ ఆఫీసర్ వేణు, వాచర్ రాకేశ్ సహకారం అందించారు. పక్కా సమాచారం మేరకు అటవీ అధికారులు అటవీ భూమిని చదును చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్‌చేసి కబ్జా యత్నం చేసిన కోలారెడ్డి, చదును చేసిన ట్రాక్టర్ యజమాని బుచ్చిరెడ్డి, డ్రైవర్ సురేశ్‌పై కోర్టులో కేసు వేశారు. అలాగే వీరికి సహకారం అందించిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ వేణును సస్పెండ్ చేశారు.